**Eenadu**

# 5వేల కొలువులు ఒకేసారి భర్తీ!

## గురుకులాల్లో నియామకాలపై సీఎం కేసీఆర్ ఆదేశం

**ఈనాడు, హైదరాబాద్:** గురుకుల పాఠశాలల్లోని ఐదువేలకు పైగా ఖాళీలను ఒకేసారి భర్తీ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న పోస్టుల వివరాలను తక్షణమే తెప్పించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఇవ్వాలని ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మకు ఆయన సూచించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఆచార్య ఘంటా చక్రపాణి బుధవారం ముఖ్యమంత్రిని కలిసినప్పుడు ఈ విషయం చర్చకు వచ్చినట్లు తెలిసింది. గ్రూప్-2, గురుకుల పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి పచ్చజెండా ఊపిన సీఎం... గురుకుల ఖాళీలను విడతల వారీగా కాకుండా ఒకేసారి నింపాలని సూచించారు. వివిధ సొసైటీలకు చెందిన గురుకులాల్లో ప్రస్తుతం 2444 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీకి పూర్తి వివరాలు వచ్చాయి. గిరిజన, ఎస్సీ సంక్షేమ గురుకులాలకు సంబంధించిన సుమారు 3200 పోస్టుల పూర్తి సమాచారం ఇంకా రావల్సి ఉందని అంటున్నారు. తొలుత 2444 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వటానికి టీఎస్‌పీఎస్సీ సిద్ధంగా ఉంది. మిగిలినవి వచ్చాక అనుబంధ నోటిఫికేషన్ ఇవ్వాలనుకున్నారు. మిగిలినవాటిని తక్షణమే తెప్పించాలని సీఎం ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురుకులాల నోటిఫికేషన్ వారంరోజుల సమయం పట్టే అవకాశముంది. సమాచారం (సర్వీస్‌రూల్స్, రోస్టర్ తదితరాలు) తొందరగా వస్తే తొందరగానే నోటిఫికేషన్ విడుదల చేస్తారు.